అభినందనలు



ఆర్డీవో సైదులుతో రామిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కీసర: కీసర ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన సైదులును బుధవారం కీసర పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సొసైటీ వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

పర్యావరణానికి మేలు చేసేలా దీపావళి జరుపుకోవాలి



మట్టి ప్రమిదలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ పావనీ జంగయ్య, కమిషనర్ చంద్రశేఖర్ గుప్తా

ఘట్‌కేసర్: పర్యావరణానికి మేలు చేసే విధంగా దీపావళి పండుగను జరుపుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ చంద్రశేఖర్‌గుప్తాతో కలిసి బుధవారం మట్టి ప్రమిదలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే బాణాసంచా కాల్చరాదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవి, జంగయ్యయాదవ్, మేనేజర్ వెంకట్‌రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం నాగారం మున్సిపల్ పరిధిలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేపై ఎన్యుమరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా తీసుకునే వివరాల జాగ్రత్తగా రాసుకుని ప్రతి ఇంటింటికి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజనీర్ సుదర్శన రఘు ,ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు.



కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి. పద్మజారావ్ దీపావళి విశిష్టతను, పండుగ జరుపుకునే విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఎక్కువ శబ్దంలేని టపాకాయలు, కాల్చాలని, పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సెరినిటి స్కూల్‌లో..



కీసర: నాగారం సెరినిటీ పాఠశాల్లో బుధవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, కార్యదర్శి వసంత తదితరులు పాల్గొన్నారు.

కాపాడేవారు లేరా..?

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

- ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న వెంచర్లు, సంస్థలు ,ఇళ్లు
- పట్టించుకోని అధికారులు
- గాలికొదిలేసిన రెవెన్యూ యంత్రాంగం

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ స్థలంలో ఎవరైనా పేదలు గుడిసె వేసుకుంటే నానా హంగామా చేసే అధికారులు వాటిని కూల్చేవరకు ఊరుకోరు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణే తమ కర్తవ్యమంటారు. బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు ఏకంగా ఎకరాల కొద్దీ భూములు ఆక్రమిస్తున్నా పట్టించుకోరు. ఒకవేళ కట్టడికి ముందుకు కదిలినా ఎక్కడికక్కడ నేతలు వారిని అడ్డుకుంటారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 11,384 ఎకరాల అసైన్డ్ భూములు, 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా వాటికి రక్షణ లేకపోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయి. ఇప్పటికే సగం భూములు ఆక్రమణకు గురై వెంచర్లు, విల్లాలు, ఇండిపెండెంట్ ఇళ్లు, పలు సంస్థలుగా మారటంతో వాటిని స్వాధీనం చేసుకోవటం కష్ట తరమవుతోంది. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఉన్న కొద్ది పాటి భూములకైనా ఫెన్సింగ్ , బోర్డులు లేక పోవటంతో.. భూకబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి యథేచ్ఛగా వాటిని ఆక్రమిస్తున్నారు. అలాగే, చెరువులు, కుంటల బఫర్ జోన్లు, శిఖం భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై కూడా రెవెన్యూ అధికార యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం వారికి వరంగా మారుతోంది.

కబ్జాల పర్వం ఇలా...

కాప్రా మున్సిపల్ సర్కిల్ పరిధిలోని సర్వేనంబర్199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి, ప్లాట్లు చేసి ,ఇళ్లు నిర్మించి రూ.15 నుంచి రూ.20 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు.

- ఓల్డ్ మల్లాపూర్ పరిధిలోని ఎస్ఎఫ్‌సీకి ఎదురుగా ఉన్న సర్వేనంబర్ 24లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు సన్నాహాలు చేపట్టారు.
- కీసర గ్రామంలోని సర్వేనంబర్ 131లో 105.26 ఎకరాల ఫారెస్టు భూమి ఉండగా, ఓ వ్యక్తి దొంగ కాగితాలను సృష్టించి... 2 ఎకరాల స్థలంలో బండరాళ్లను పగులగొట్టి, స్థలాన్ని చదును చేసి, భవన నిర్మాణ పనులు ప్రారంభించినా ఫారెస్టు , రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవటం లేదు. ఈ భూకబ్జాపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- కీసర రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 825లో 7.08 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల కబ్జాలో ఉండగా, అదే ప్రాంతంలోని 181 సర్వేనంబరులోని 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.
- బోడుప్పల్ పరిధిలోని సర్వేనంబరు 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, 1974 నుంచి ఆక్రమణకు గురవుతోంది. అప్పట్లో బోడుప్పల్ గ్రామ పంచాయతీగా ఉండటంతో ఓ భూకబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ జీపీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయించాడు. ప్రస్తుతం అదే ప్రభుత్వ స్థలాన్ని స్థానిక రాజకీయ నాయకులతో కలిసి గజం రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు.
- బోడుప్పల్‌లో పార్కు, శ్మశాన వాటికకు చెందిన 2611 గజాల స్థలంతోపాటు అక్షయ నగర్‌లో 509 గజాలు, వెంకటేశ్వర్‌నగర్‌లో 350 గజాల పార్కుల స్థలం అన్యాక్రాంతమవుతోంది.
- ఫీర్జాదిగూడలోని 13 కాలనీల్లోని 3 ఎకరాల పార్కుల స్థలాలు కూడా కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. చెంగిచర్ల చింతల కుంట చెరువు కట్ట సంబంధించిన భూముల్లో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.
- దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని అహ్మద్‌గూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 51లో రెండెకరాలు. సర్వేనంబర్ 504లో 3.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. సర్వేనంబర్ 22లో పార్కు స్థలం కబ్జాకు గురైంది. దమ్మాయిగూడలోని సర్వే నంబర్లు 530లో 2 ఎకరాలు , 574లో 2.13 ఎకరాలు, బండ్లగూడలోని సర్వేనంబర్74లో అన్యాక్రాంతమయ్యాయి.
- నాగారంలోని 297 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా... రెవెన్యూ శాఖలో చలనం రావడం లేదు. ప్రధాన రోడ్డుకు అనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములకు కబ్జాకు గురయ్యాయి.
- చీర్యాల గ్రామంలోని సర్వేనంబర్ 7,8లలో 12.5 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఇదే రెవెన్యూ గ్రామంలో సర్వేనంబర్ 152/2లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి విక్రయించారు.
- గాగిల్లాపూర్‌లోని 214 సర్వే నంబరులో 57 ఎకరాల అసైన్డ్ భూమిలో 40 ఎకరాలు, డి.పోచంపల్లిలో 120 సర్వేనంబరులో 152 ఎకరాల అసైన్డ్ భూమిలో 60 ఎకరాలు కబ్జా గురైనట్లు తెలుస్తోంది.
- నిజాంపేటలోని 332, 233, 334 సర్వేనంబర్లలోని 300 ఎకరాల్లో సగం భూములను కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారు.
- గాజుల రామారంలోని సర్వేనంబర్లు 307, 329,79,307లలోని 30 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా గురైనా పట్టించుకునేవారు లేరు.
- శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాలకు పక్కనున్న 10 ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా , రెవెన్యూ అధికారుల్లో స్పందన లేదు.
- జవహర్‌నగర్‌లో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇందులో ప్రైవేట్ ఆసుపత్రితోపాటు ఇతర సంస్థల నిర్మాణాలు కూడా చేపట్టారు.
- ఘట్కేసర్, కాచగాని సింగారం, చౌదరిగూడ ,ప్రతాప్ సింగారం, పీర్జాదిగూడ, పర్వాతాపూర్,మేడిపల్లి,పోచారం ప్రాంతాల్లోనూ వందలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాకు గురైనట్లు అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు అందుతున్నా... పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



స్టేడియం స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు



మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న నాగేశ్‌గుప్తా తదితరులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బొందుగుల చంద్రశేఖర్‌గుప్తాను ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చు నాగేశ్‌గుప్తా ఆధ్వర్యంలో బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పసుపునూరి శేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి విశ్వనాథం, శరత్, రాము తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాలకు ఆహ్వానం



కీసర: సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నవంబర్ 2నుంచి డిసెంబర్ 1 వరకు నెలరోజుల పాటు నిర్వహించనున్న కార్తీకమాసోత్సవ ప్రత్యేక పూజలకు ఆలయ ప్రతినిధులు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలను ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్తీక మాస ప్రత్యేక పూజల్లో కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కీసర: రైతులు తాము పండించిన వరిధాన్యాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయిస్తే లాభసాటి ధర లభిస్తుందని కీసర పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా ఖరీఫ్ 2024 సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లై కోపరేటీవ్ మేనేజర్ సుగుణ బాయ్, కీసర మండల వ్యవసాయాధికారి మాధవీలత, సంఘం ఉపాధ్యక్షులు పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, కందాడి పోచిరెడ్డి, ధర్మానాయక్, మేనేజర్ కృష్ణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుల గణన పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీ జంగయ్య

ఘట్‌కేసర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేను ఇంటింటికి వెళ్లి పారదర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యలయం ఆవరణలో కుల గణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌గుప్తాఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ సర్వేకు వచ్చిన అధికారులకు కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డుల వివరాలు అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, మేనేజర్ వెంకట్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను, మల్లారెడ్డి, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆశ వర్కర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బిట్స్ పిలానీలో రైజ్-2024 వర్క్‌షాప్



కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాల నిపుణులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో బుధవారం ఇంటెలిజెంట్ సిస్టమ్‌లో ఆధునిక పురోగతిపై ఏపీసీఏఐఆర్, బిట్స్ ఫిలానీ, ఐఎన్ఆర్ఐఏ-డీఎస్టీ, ఐఈఈఈ కంప్యూటర్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో (రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్) రైజ్-2024 మల్టీ డిసిప్లినరీ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఫ్రాన్స్ ఐఎన్ఆర్ఐఏ ప్రొఫెసర్ డాక్టర్ అంటిట్జా దంచేవియా, హైదరాబాద్ ఐఐటీ కంప్యూటర్ సొసైటీ ప్రొఫెసర్ కె.మాధవకృష్ణ, హైదరాబాద్ సెంట్రల్ ఫోరెనిక్స్ ల్యాబ్ డాక్టర్ ఎం .కృష్ణ హాజరై కీనోట్, ప్యానెల్ సెషన్, డెమో, పోస్టర్ సెషన్ ప్రదర్శన చేశారు. ఇస్రో తరపున హాజరైన డాక్టర్ కె.ఎస్.సోమశేఖర్ ఉత్పాదక నమూనాలు, సైబర్ ఫోరెన్సిక్, రిమోట్ సెన్సింగ్ తదితర అంశాలను వివరించారు. విప్రో, పారి కో-సీఈవో సుందరరామన్ గణపతిరామన్, ఐఈఈఈ కంప్యూటర్ సొసైటీ హైదరాబాద్ సెక్షన్ చైర్ ప్రొఫెసర్ వినీత్ తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో బిట్స్ ఫిలానీ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ, డీన్ ప్రొఫెసర్ యోగేశ్వరి, ప్రొఫెసర్ అభిజిత్ దాస్, బిట్స్ ఫిలానీ అధ్యాపకులు, జాతీయ, అంతర్జాతీయ నిపుణులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ



మాట్లాడుతున్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్

కీసర: బీజేపీ తన రికార్డులను తానే తిరగ రాస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా గుర్తింపు పొందిందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ సభ్యత్వ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా కార్యకర్తలు పేర్లు నమోదు చేసుకుంటున్నారని, క్రియాశీలక, సభ్యత్వం పొందిన నాయకులు కూడా భారతీయ జనతా పార్టీలోనే ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది సభ్యులు కలిగి ఉన్నారన్నారు. తెలంగాణలో మేడ్చల్ మొదటి స్థానంలో ఉందని, అందులో నాగారం మున్సిపాలిటీ ముందంజలో ఉందన్నారు. మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షులు పటోళ్ల విక్రంరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మేడ్చల్ జిల్లా బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ వైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, జిల్లా పర్యవేక్షకులు అశోక్, మేడ్చల్ కంటెస్టెంట్ ఏనుగు సుదర్శన్‌రెడ్డి,మేడ్చల్ కన్వీనర్ అమర్‌మోహన్‌రెడ్డి, బుద్ధిశ్రీనివాస్, సీనియర్ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు , ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న పవర్‌గ్రిడ్ ఉద్యోగులు

ఘట్‌కేసర్: అవనీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పవర్‌గ్రిడ్ జనరల్ మేనేజర్ లూసియస్, సీఐ పరుశురాం అన్నారు. ఘనాపూర్ పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో ఘనాపూర్ ఓఆర్ఆర్ నుంచి ఘట్‌కేసర్ బస్ స్టాప్ వరకు అవినీతి నిర్మూళనపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంచం అడిగిన వారి సమాచారం విజిలెన్స్ అధికారులకు ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ డీజీఎండీ ఎంసీఎస్ రెడ్డి, సీఎం కిశోర్, సంపత్, పవర్‌గ్రిడ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

మల్లాపూర్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మల్లాపూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలను పంచిపెట్టి విజయోత్సవ సంబురాలను నిర్వహించుకున్నారు. ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు.





మార్కెట్‌కు దీపావళి శోభ

దీపావళి పండగ సందర్భంగా మేడ్చల్‌లో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. పూజా సామాగ్రి, బాణా సంచాల దుకాణాలు, పూల దుకాణాలు, అలంకరణ సామాగ్రిల దుకాణాలతో మార్కెట్ కిటకిటలాడుతోంది. వివేకానంద విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఉన్న రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం నుండి రైతు బజారు వరకు ఉన్న రోడ్డు కోనుగోలు దారులతో కిటకిటలాడింది. పువ్వుల ధరలతో పాటు ,అన్ని వస్తువుల ధరలు అధికంగా కనిపించాయి. -మేడ్చల్





రూ.500 బోనస్‌తో సన్న వడ్లు కొనుగోలు చేయాలి



సాక్షి, సిటీబ్యూరో: రేషన్ కార్డుదారులకు జనవరి-2025 నుంచి సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్‌తో సన్న వడ్లు కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో వర్షాకాలానికి సంబంధించి ధాన్యం సేకరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రకళ, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు ధాన్యం సేకరణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు , రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముందుస్తుగా రైతులను తడి, తాలు, దుమ్ము లేకుండా తూర్పారబట్టి, ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చైతన్యం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరికోత సమయంలో వరినూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో కొనుగోలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకే కేంద్రంలో సన్న, దొడ్డు రకం వడ్లకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. రైస్ మిల్లులకు కూడా వేర్వేరుగా ధాన్యాన్ని తరలించేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. రైతు ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా సంబంధిత అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు..

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి



సాక్షి,సిటీబ్యూరో: దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ టపాసులను కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అజ్ఞానపు చీకట్లను తొలగించి విజ్ఞానాన్ని వెలిగించాలని, అందరి జీవితాలలో కొత్త ఉత్తేజాన్ని నింపాలని ఆశిస్తున్నానన్నారు.